# మనవడి కోసం (అను) భక్త బండెంకటరెడ్డి కథ

*ఆరడుగుల పొడవు, అయిదడుగుల వెడల్పు, టన్ను బరువు - గున్న ఏనుగులా వుండే వెంకటరెడ్డిని అంతా బండెంకట రెడ్డి అని చాటుగా అంటుంటారు. ఆ భారీ శరీరంమీద మెడ కనిపించదు కాని చాకలి బానమీద బోర్లించిన పిడతలా చిన్న తలకాయ కనిపిస్తుంది. ఆ చిన్న తలకాయలో అతి చిన్ని మెదడు. ఆ అతి చిన్ని మెదడులో ప్రస్తుతం కొండంత విచారం.*

వెంకటరెడ్డికి లేకలేక కలిగిన బిడ్డలు ఇద్దరు - పెద్దమ్మాయి అనంతలక్ష్మి పెళ్లయ్యాక పదేళ్లకు పుట్టింది. పెద్దమ్మాయి పుట్టిన పన్నెండేళ్లకు రెండో అమ్మాయి అచ్యుతలక్ష్మి కలిగింది. ఆ తర్వాత మరి సంతానం కలగలేదు వెంకటరెడ్డికి.

చిన్నప్పుడే తల్లిదండ్రులు చనిపోతే, చెల్లెలు కొడుకు సత్తిరెడ్డిని పెంచి పెద్దచేసి అనంతలక్ష్మినిచ్చి పెళ్లిచేశాడు వెంకటరెడ్డి. వాళ్ల పెళ్లయి పదేళ్లయిందికాని ఇంతవరకూ సంతానం కలగలేదు.

అదీ బండెంకటరెడ్డి చిన్నమెదడును ఇప్పుడు వేధిస్తున్న పెద్ద బెంగ.

ఓ రోజు బండెంకటరెడ్డి చెరువుగట్టున గుడి అరుగుమీద బాసింపట్టు వేసుకుని కూర్చుని ఆ విషయం గురించే దిగులుగా ఆలోచిస్తుండగా సన్నాయి మేళం పాట వినిపించింది.

'ఎవుడింట్లో పెళ్లబ్బా' అని ఆలోచిస్తుండగా రెండు ఏనుగులు రోడ్డు మలుపు తిరిగి వెంకటరెడ్డికి కనిపించాయి. వాటి వెనకాల సన్నాయి మేళం, దాని వెనకాల ఓ పల్లకీ, ఆ పల్లకీమీద పూలు చల్లుతూ పడుచులూ, పల్లకి వెనకాల ఓ పందమంది భక్తబృందం, వారి వెనకాల ఓ పాతికమంది కుర్రాళ్లూ, క్రమంగా బండెంకటరెడ్డికి కనిపించారు.

'భగవాన్ శ్రీశ్రీశ్రీ సత్యనాథబాబాకీ జై,' అని ఆనంద పారవశ్యంలో జయజయధ్వానాలు చేస్తున్నారు భక్తులు. ఆ ఊరేగింపు అలా గుడి ముందునుంచి వెడుతుంటే బండెంకటరెడ్డి గుడి అరుగు దిగి, 'ఎవరబ్బా ఈయన!' అని నోరు తెరిచి చూడసాగాడు.

'ఓయ్.. జోగి పంతులూ' అని భక్తబృందం వెనుక వరుసలో వున్న జోగిపంతుల్ని ఆగమన్నట్లు ఓ కేకవేసి, తను పరుగెట్టి జోగిపంతుల్ని కలిసి, 'సాములోరు ఎవరు?' అనడిగాడు వెంకటరెడ్డి.

జోగిపంతులు వినకూడని మాట విన్నట్లు మొహంపెట్టి - "ఎవరూ అని అడుగుతున్నావా? అసలు నువ్వీ ప్రపంచంలోనే వున్నావా? భగవాన్ పేరు విననేలేదా?" అనడిగాడు తీవ్రంగా.

బండెంకటరెడ్డి వినలేదన్నట్లు తల అడ్డంగా ఊపి, "సాములోరు చాలా గొప్పోళ్లా?" అని అడిగాడు.

"గొప్పవారా? ఆయన భగవంతుడి అవతారం రెడ్డీ! ఈ కలియుగంలో మనల్ని ఉద్ధరించడానికి అవతరించిన భగవంతుడు. అయినా నీకేం తెల్సు. రోజూ ఓ కోడిని లాగించడం, అది అరిగేదాకా ఇంటరుగుమీద కూర్చుని అందరితోనూ పోట్లాడ్డం తప్ప-" అని బండెంకటరెడ్డిని ఈసడించి భగవాన్ గొప్పదనాన్ని గురించి చెప్పసాగాడు జోగిపంతులు.

ఊరేగింపు గుడి దగ్గర్నుంచి భగవాన్ బస కోమట్ల సత్రం చేరే టప్పటికి భగవాన్ భగవత్స్వరూపులనే నిర్ణయానికొచ్చేశాడు బండెంకటరెడ్డి. వెనుక వరుసలోంచి ముందు వరుసలోకి వచ్చేసి అడిగినవారికీ, అడగని వారికీ కూడా భగవాన్ గొప్పదనం గురించి ఉత్సాహంగా చెప్పడం మొదలుపెట్టాడు. 'ఓయ్ జోగిపంతులూ!' అని జోగిపంతుల్ని పిలిచి, 'సాములోరు చాలా గొప్పోళ్లు తెలుసా!' అని భగవాన్ మహిమల గురించి జోగిపంతులు తనకు చెప్పిన కథలు తిరిగి జోగిపంతులుకే రెండు సార్లు చెప్పాడు ఆ అరగంటలోనూ.

త్వరలోనే ఫ్రంట్ రేంకు భక్తుల్లో ఒకడైపోయాడు బండెంకటరెడ్డి. భగవాన్ దగ్గర రోజంతా గడిపి, ఆయన అంతరంగిక భక్తబృందం పనిగట్టుకొని భగవాన్ మహిమల్ని కీర్తిస్తూ చెప్పే కథలు బండబ్బాయిలా నోరు తెరిచి విని, వాటికి మరి నాలుగు చేర్చి, పెద్ద నోరేసుకుని ఊరిమీద పడి అందరికీ చెప్పేవాడు. చిన్న పిల్లలు తమ ఫేవరిట్ సినిమా హీరో చిరంజీవి గురించో, కృష్ణంరాజు గురించో ఉన్నవీ లేనివీ

ఊహించి గొప్పగా చెప్పినట్లు వెంకటరెడ్డి చిలువలు పలువలుగా చేర్చి కథలల్లి చెబుతుండేవాడు.

లోకమంతా 'అదిగో పులంటే, ఇదిగో తోక' అన్నా, అసలు పులేదని ఎదురు నిలిచి ప్రశ్నించే మొండివాళ్లు కొంతమంది వుంటారు.

బండెంకటరెడ్డి అల్లుడు సత్తిరెడ్డి ఆ జాతికి చెందినవాడు. మామకీ, అల్లుడికీ అస్తమానూ భగవాన్ విషయమై తీవ్రంగా వాదోపవాదాలు జరిగేవి.

'ఒరే కొండిగా - ఇదిన్నావా...' ఉదయమే అరుగుమీద కూర్చుని రోడ్డుమీద పోతున్నవాడిని ఎవడినో ఆపుజేసి మొదలుపెట్టేవాడు వెంకటరెడ్డి. "...సాములోరికి యమ్మేలు, బియ్యేలు, డాక్టర్లు, ఫారినోళ్లు - చాలా మంది భక్తులున్నారు తెల్సా! ఆళ్లందరూ సాములోర్ని టెస్టు చేసి ఆయన శక్తులు తెలుసుకొని చెవులట్టుకుంటుంటే, మెట్రిక్ మూడుసార్లు తన్నేసినెదవలు..." అరుగుమీద తన పక్కనే కూర్చున్న సత్తిరెడ్డికేసి ఓరకంట చూస్తూ అనేవాడు వెంకటరెడ్డి, 'ఏనుగెనకాల కుక్కలు మొరిగినట్లు ఆయన్నిమర్శిస్తారు..'

"డిగ్రీలకీ, కామన్సెన్సుకీ సంబంధం లేదురా కొండిగా! అందుకే చదువుకున్నాడికంటే చాకలాడు మేలన్నారు - సామెత వినలేదూ," అనేవాడు సత్తిరెడ్డి సమాధానంగా.

"ఓ సారి హైద్రాబాదులో జపానోడు షిప్పు దగి సాములోరి దగ్గరకొచ్చి ఆడి బాసలో పాస్‌పీస్ అని మాట్లాడ్డం మొదలెట్టాడంట. ఆడి భాష ఎవడికీ అర్థం కాలేదంట. సాములోరు మాత్రం చిర్నవ్వుతో ఆడు చెప్పిందంతా విని జర్మనులో టకటకా మని ఏదాలు, ఉపనిషత్తుల గురించి చెప్పేటప్పటికి ఆడు డంగైపోయి కాళ్లమీద పడి పోయి మరి వదల్లేదంట..."

"హైద్రాబాదులో షిప్పుదిగిన జపానోడితో జర్మన్లో మాట్లాడితే ఆడు డంగైపోక చస్తాడేంటి?" అన్నాడు సత్తిరెడ్డి నవ్వుతూ.

బండెంకటిరెడ్డి ఇవన్నీ అల్లుడిముందు చెప్పటంలో అసలు ఉద్దేశం వేరేవుంది. భగవాన్ ఊరికి వచ్చిన కొత్తల్లో అల్లుడితో "అనంతం, నువ్వూ వెళ్లి సాములోరి దర్శనం చేసుకోండిరా! ఆయన కరుణిస్తే సంతానం కలగొచ్చు" అన్నాడు. అల్లుడు నేను రానుపొమ్మన్నాడు. భగవాన్ మహిమలు తెలిపే కథలు ఇలా రోజూ చెప్పి అల్లుడి బ్రెయిన్ వాష్‌చేసి భగవాన్ పాదాలదగ్గరకు చేర్చాలని మామగారి ఆలోచన.

'ఇదిన్నావా రామశాస్తుర్లూ...' నాలుగు రోజుల తర్వాత పొద్దుటే అరుగుమీద చేరి పెద్ద ఇత్తడిగ్లాసుతో కాఫీ తాగుతూ, చెంబుచ్చుకు

పరుగెడుతున్న రామశాస్త్రిని ఆపుచేసి మొదలు పెట్టాడు బండెంకటరెడ్డి. "... ఓసారి రాజమండ్రిలో సాములోర్ని టెస్టు చెయ్యడానికి గదిలోపెట్టి ఆరుతాళాలేసి రాత్రిపగలూ కాపలాపున్నారంట. వారం రోజుల తర్వాత తాళాలు తీస్తే సాములోరు అక్కడలేరంట..."

'ఎక్కడున్నారు?' - రామశాస్త్రి ఆశ్చర్యంగా ప్రశ్నించాడు.

రామశాస్త్రి ఈ కథ అప్పటికి తొంభైసార్లు విన్నాడు. బండెంకటరెడ్డే రామశాస్త్రి కనిపించినప్పుడల్లా చెబుతూ ఇప్పటికి ఇరవైరెండుసార్లు చెప్పాడు. అలా ఆశ్చర్యంగా 'ఎక్కడున్నారు?' అని ప్రశ్నించకపోతే తను కథ సరిగ్గా చెప్పలేదనుకుని మళ్లీ మొదలెడతాడు వెంకటరెడ్డి.

"...పెనుగొండలో కన్యకాపరమేశ్వరి గుళ్లో ఆ ఏడు రోజులూ యాగాలు చేయిస్తున్నారంట" అని చెప్పి, "ఆయన్ని తాళాలేవాపుతాయి, ఎర్రిమొకాలు కాకపోతే. ఆయన ఎప్పుడు కావాలంటే అప్పుడు మాయమై, ఎక్కడ కావాలంటే అక్కడ ప్రత్యక్షమవ్వగలడు. ఆయనకు అసాధ్యమేంటి భగవంతుడి అవతారమైతే" - బండెంకటరెడ్డి కళ్లు రెండూ మూసుకుని లెంపలేసుకుంటుండగా రామశాస్త్రి బతుకుజీవుడా అని పొట్టపట్టుకుని పరుగుదీశాడు.

"అంత మహిమలున్నాయన - పెట్రోలుకి కరువొచ్చింది కదా - మంత్రం వేసి నీటిని పెట్రోలుగా మార్చొచ్చు కదా" అన్నాడు సత్తిరెడ్డి సిగరెట్టు వెలిగించి అగ్గిపుల్ల తూంకాలవలో విసిరేస్తూ. "నీదంతా కుతర్కంరా సత్తిగా! అసలు దేవుడు పెట్రోలు బూవిలోనూ, నీళ్లు బూవిపైనా ఎందుకుంచాడో తెల్సా?"

"ఎందుకూ?"

"పెట్రోలు బూవిపై వుంటే ఏవవుతుంది? నీలాంటి ఎదవెవడో సిగరెట్టెలిగించి అగ్గిపుల్ల పడేశాడనుకో - సముద్రాలూ, నదులూ, కాలవలూ అన్నీ బగ్గుమంటాయి. అంచేత దేవుడు పెట్రోలు బూవడుగున దాచి నీళ్లు పైనుంచాడు. భగవాన్ నీళ్లు పెట్రోలుగా మారిస్తే సృష్టంతా బగ్గుమంటుంది."

అల్లుడు చేసే ప్రతి కుతర్కానికీ మావదగ్గర సమాధానం రెడీగా వుంటుంది. మావచెప్పే ప్రతీదానికి అల్లుడి దగ్గర ప్రశ్న రెడీగా వుంటుంది.

"అతనంతా ఎడ్డెపంటే తెడ్డెపనే రకం! అతనితో వాదించకు" అని అత్త మావని మందలించి, "స్వామివారి దయవలన ఎంతమందికి ఎన్ని

జరగటం లేదు? ఏం చేస్తాం - జగమొండి దొరికాడు. ఒసే అనంతం! నువ్వేనా మీ ఆయనకు చెప్పిచూడవే," అని కళ్లనీళ్లెట్టుకుంది అత్తగారు.

ఎవరెంత చెప్పినా సత్తిరెడ్డి వినక మొండికేస్తే చివరకు బండెంకటరెడ్డే భార్యాబిడ్డల్ని తీసుకొని భగవాన్‌కి తమ కోర్కె నివేదించుకోడానికి దర్బారు రోజున వెళ్లాడు. దర్బారంటే భగవాన్ భక్తుల కోర్కెలు తీర్చడానికి ప్రత్యేకంగా కేటాయించిన రోజన్నమాట. వారానికి రెండుమూడుసార్లు దర్బారులోకి వస్తారు భగవాన్.

ఆయన దర్బారులో ఉన్న వందలాది భక్తుల్లో కొందర్ని మాత్రం పిలుస్తారు. భగవాన్‌కి గొప్పా, బీదా తారతమ్యం లేదు. ఆయనకు స్వపరభేదం లేదు. నిత్యం తన సేవలు చేస్తున్న భక్తులనైనా ఆయన దర్బారులో రెండు మూడు వారాలైనా పిలవకపోవచ్చు. అపరిచిత వ్యక్తుల్ని మొదటిసారే పిలవచ్చు. అంచేత భగవాన్ కరుణించేవరకు భక్తులు ఒక్కోసారి కొన్ని వారాలుకూడా వేచివుంటారు.

భక్తులు వారి కోరికల్ని భగవాన్‌కి నివేదించక్కర్లేదు. భగవాన్ త్రికాలజ్ఞులు. వారికి అన్నీ తెలుస్తాయి. భగవాన్ కుడిచెయ్యి ఓసారి గాలిలో తిప్పి విభూతి, ఉంగరాలు, తాయత్తులు, గొలుసులు, వాచీలు శూన్యంలోంచి సృష్టించి భక్తులకిచ్చి, వారి కోరికేవిటో తనే చెప్పి అది నెరవేరుతుందని దీవిస్తారు.

బండెంకటరెడ్డి భార్యాబిడ్డలతో వెళ్లి ముందువరుసలోనే కూర్చున్నాడు. భగవాన్ రాకకోసం ఎదురుచూస్తూ, భక్తులు పాటలుపాడుతూ భగవాన్ మహిమలు కొనియాడుతుండగా భగవాన్ చిరునవ్వుతో దర్బారులో ప్రవేశించాడు. భక్తులందరూ లేచినిలబడి ఆనందపారవశ్యంతో 'భగవాన్ శ్రీశ్రీశ్రీ సత్యనాథ బాబాకీ జై' అంటూ అరవసాగారు.

తన కాళ్లకి అడ్డంపడ్డవాళ్లని శివకామయ్య, జోగిపంతుల్లాంటి అంతరంగికులు 'తప్పుకోండి, తప్పుకోండి' అని అదిలిస్తుంటే కొందరు భక్తులు పాదధూళి కళ్లకద్దుకుంటుండగా, అప్పుడప్పుడు కుడిచెయ్యి చాచి వాళ్ల తలలమీద వుంచుతూ, తిన్నగా నడిచి వేదికమీద సింహాసనం లాంటి తమ ఆసనంలో ఆసీనులయ్యారు భగవాన్.

భగవాన్ ఆరడుగుల స్ఫురద్రూపి. పచ్చగా దబ్బపండు చాయలో వుండి చూడగానే ఆకర్షించే గొప్ప పెర్సనాలిటీ వారిది. పైనుంచి పాదాలవరకూ కాషాయరంగు సిల్కు అంగీ వేసుకుని బ్రహ్మవర్చస్సుతో

వెలిగిపోతున్నారు భగవాన్. ఆయనలో ముఖ్యంగా ఆకర్షించేవి ఆయన కళ్లు. కళ్లల్లో ఆ ప్రశాంతత, తేజస్సు లోకం అంటే తెలియని పసిపాపల్లోనూ, లోకం మాయగా భావించి పట్టించుకోని స్వామీజీల్లోనూ మాత్రమే కనిపిస్తుంది.

అలా ఆయన ఆసీనులై నిశ్శబ్దంగా వుండమన్నట్లు చెయ్యి కొంచెం పైకెత్తి సభంతా కలియజూశాడు. అలా చూస్తూ ముందు వరుసలో కూర్చున్న వెంకటరెడ్డి కుటుంబంమీద రెండు క్షణాలపాటు చూపు నిలిపాడు.

వెంకటరెడ్డి పక్కన అతని భార్య కూర్చుంది. భార్య ప్రక్కన పెద్దకూతురు అనంతలక్ష్మి కూర్చుంది. అనంతలక్ష్మికి ముప్పయ్యేళ్లున్నా సన్నగా, పీలగా ఇరవై ఏళ్లదానిలా కనిపిస్తుంది. అనంతలక్ష్మి పక్కన కూర్చున్న అచ్యుతలక్ష్మిది తండ్రిపోలిక. వయసు పద్దెనిమిదే అయినా గుర్రంలా ఎదిగి పాతికేళ్లదానిలా కనిపిస్తుంది. చూసినవాళ్లంతా అచ్యుతలక్ష్మి పెద్దకూతురూ, అనంతలక్ష్మి చిన్న కూతురూ అనుకుంటారు.

భగవాన్ అలా వెంకటరెడ్డి కుటుంబాన్ని పరిశీలనగా చూసి, వెంకటరెడ్డికేసి తిరిగి - "ఇద్దరు లక్ష్ములు ఇంటవుంటే ఇంకా ఎందుకు దిగులు రెడ్డీ?" అన్నాడు చిర్నవ్వుతో.

అంతమందిలోనూ తన్ను పేరు పెట్టి అలా అభిమానంగా పలకరించినందుకు బండెంకటరెడ్డి పొంగిపోయాడు. ఆనందబాష్పాలు రాలుస్తూ భగవాన్‌కి రెండు చేతులూ జోడించి నమస్కరిస్తూ ఏదో చెప్పబోతుండగా భగవాన్ ప్రశ్నించాడు - "సత్తిరెడ్డి రాలేదా?"

వెంకటరెడ్డి నెత్తిమీద పిడుగుపడ్డట్లయింది. నోటమాటరాలేదు.

"సత్తిరెడ్డి నాస్తికుడు, మా శక్తి శంకిస్తున్నాడు." భగవాన్ అలా అనగానే సభలోని భక్తులంతా 'అపచారం, అపచారం' అన్నట్లు లెంపలేసుకుని ఏదో ఘోరం జరిగిపోయినట్లు దిగాలుపడి నిశ్శబ్దమైపోయారు. ఆ నిశ్శబ్దంలో భగవాన్ కంఠం ఖంగుమంది, "... సత్తిరెడ్డికి మా శక్తి తెలిసి కళ్లు తెరుచుకునేరోజు త్వరలోనే వస్తుంది..."

దర్బారులో వున్న భక్తులంతా వెంకటరెడ్డికేసి విశ్వాసఘాతకుణ్ణి చూసినట్లు చూశారు. వెంకటరెడ్డి భగవాన్‌కి ఆగ్రహం కలిగినందుకు భయపడుతూ, సత్తిరెడ్డి నాస్తికత్వం గుర్తుకొచ్చి మండిపడుతూ తలవంచుకు కూర్చున్నాడు సభలో.

భగవాన్ ఆ రోజు దర్బారులో అయిదారుగుర్ని పిలిచి కొందరికి విభూతీ, కొందరికి ఉంగరాలూ సృష్టించి ఇచ్చి వారి కోరికలు తీరేలా దీవించారు కాని వెంకటరెడ్డిని మాత్రం పిలవలేదు.

"మొండి తొత్తుకొడుకు - చెబితే వినడు, తనకు తోచదు," వెంకటరెడ్డి ఇల్లుచేరిన తర్వాత నిప్పుతొక్కిన కోతిలా గంతులేస్తూ అల్లుణ్ణి తిట్టడం మొదలుపెట్టాడు.

"ఏవిటా తిట్లు - అతను విన్నా, అమ్మాయి విన్నా బాగుండదు," అని మందలించింది వెంకటరెడ్డి భార్య.

"సాములోరికి ఆగ్రహం వచ్చిందంటే ఈడు మసైపోతాడు చూడు - ఆ తర్వాత నన్నని ఏం లాభం లేదు," అన్నాడు వెంకటరెడ్డి. జరగబోయే ఈ ఘోరంలో తన బాధ్యత ఏవీ లేదన్నట్లు చేతులు కడిగేసుకుంటూ.

"ఏం జరగాలో అదే జరుగుతుంది కాని నువ్వతనితో పోట్లాటెట్టుకోకు," అంది అతని భార్య.

మూడు వారాలు వరుసగా అలా దర్బారుకి వెడుతున్నా వెంకటరెడ్డిమీద భగవాన్‌కి అనుగ్రహం కలగలేదు. మరోవారం పోయిన తర్వాత ఓ రోజు భగవాన్ భక్తులను పిలుస్తూ వెంకటరెడ్డి కుటుంబం కేసి చూశాడు. భగవాన్ ఈ రోజైనా కరుణిస్తారా, కరుణించరా అని వెంకటరెడ్డి గుండె టకాటకామని కొట్టుకుంది. భగవాన్ అలా కొంచెం సేపు చూసి, 'ఇలా రా అమ్మా' అని అచ్యుతలక్ష్మిని పిలిచాడు.

అనుకోకుండా తనని పిలవడంతో అచ్యుతలక్ష్మి కంగారుపడి అటూ ఇటూ చూసింది. వెంకటరెడ్డికి మాత్రం ఏనుగెక్కినంత సంబరం కలిగింది. ఈనాటికి భగవాన్ అచ్చితాన్నయినా కరుణించారని సంతోషంతో 'వెళ్ళవే అచ్చితం - భగవాన్ పిలిస్తే అలా దిక్కులు చూస్తావేం' అని తొందరచేశాడు వెంకటరెడ్డి.

అచ్యుతలక్ష్మి లేచి భగవాన్ దగ్గరకు వెళ్లి పాదాలు కళ్లకద్దుకుని నమస్కరించి నిలబడింది.

భగవాన్ కుడిచెయ్యి గాలిలో తిప్పి కుంకుమ సృష్టించి, అచ్యుతలక్ష్మి నుదుటి మీద పాపిడిదాకా బొట్టుపెట్టి, "దీర్ఘసుమంగళీభవ - వెంకటరెడ్డి కోరిక త్వరలోనే తీరుతుంది. నువ్వు త్వరలోనే పండంటి బిడ్డను కంటావు." అని దీవించాడు.

అచ్యుతలక్ష్మి తెల్లబోయి, తల్లిదండ్రులకేసి బెదురుచూపులు చూసి సిగ్గుతో కళ్లు వాల్చేసింది.

"భగవాన్, అది అచ్చితం - మా చిన్నమ్మాయి - దానికింకా పెళ్లి కాలేదు," అన్నాడు బండెంకటరెడ్డి కంగారుగా.

భగవాన్ గొంతులో పచ్చివెలక్కాయ పడ్డట్లయింది.

అయితే అనంతలక్ష్మికి, అచ్యుతలక్ష్మికి కన్‌ఫ్యూజయ్యాననీ, ఒకరిని బదులు ఒకరిని దీవించాననీ సర్వం తెలిసిన భగవాన్ ఒప్పుకోరు కదా - అంచేత ఆయన చిరునవ్వు నవ్వి, పక్కనే నిలబడ్డ శివకామయ్యకేసి, 'ఓవర్ టు యు' అన్నట్లు చూశారు.

వెంటనే శివకామయ్యగారు కలుగజేసుకుని, 'ఏవిటి రెడ్డీ - నీకు పిచ్చా! భగవాన్‌కి ఆ విషయం తెలియదా! అది తెలిసే అలా దీవించారూ అంటే ఏదో కారణం ఉండేవుంటుంది. అనుకోకుండా అచ్చితానికి పెళ్లయి మనవడు పుడతాడని ఆయన ఉద్దేశమేమో! భగవాన్‌ని తెల్సుకోడం నీ తరమా నా తరమా!" అని గుంభనంగా అని, 'లెంపలేసుకో' అని మందలించాడు వెంకటరెడ్డిని.

భగవాన్ దీర్ఘంగా గాలిపీల్చి మెల్లగా వదిలి శివకామయ్యగారికేసి థేంక్యూ అన్నట్లు చూసాడు. శివకామయ్యగారు చిరునవ్వు నవ్వి తల ఊగించాడు. వాళ్లిద్దరి చిరునవ్వుల అంతరార్థం వెంకటరెడ్డికి బోధపడలేదు. కాని, "సాములోరి లీల తెల్సుకోడం నా తరమా, నేనొక ఎదవని" అని తన్నుతాను తిట్టుకుని లెంపలేసుకున్నాడు బండెంకటిరెడ్డి.

శివకామయ్యగారి సమయస్ఫూర్తి - చుర్రుమనగానే కాలే పెనం మీంచి పైకి లేపి అప్పటికి తాత్కాలికంగా ప్రమాదం నుంచి తప్పించినా - తనను మండేపొయ్యిలో పడెయ్యబోతున్నదని త్రికాలజ్ఞులకి పాపం ఆ క్షణంలో తెలియలేదు.

ఇది జరిగిన రెండు నెలల తర్వాత ఓ రోజు ఉదయం అచ్యుతలక్ష్మి తల్లి లేపగా లేపగా బద్ధకంగా లేచింది.

"అచ్చితం ... కాలేజీకి వెళ్లవా - ఇంత లేటుగా లేస్తున్నావు? అయినా నీకీమధ్య బద్ధకం ఎక్కువైపోతోందే" అని తల్లి తిడుతుంటే మెల్లిగా మొహం కడుక్కువచ్చింది. తల్లి అందించిన కాఫీగ్లాసు తీసుకుని కాఫీ తాగబోతూ, గ్లాసు కింద వదిలేసి, కుడిచేత్తో గొంతుపట్టుకుని 'ఓ...'

అంటూ పెరట్లోకి పరుగెట్టి వాంతి చేసుకుంది.

'ఏమైందే అచ్చితం?' అంటూ వెనకాలే వచ్చిన తల్లి, ఇంకో రెండు రోజుల తర్వాత ఏమయిందో గ్రహించి, 'అనంతం...! కొంపమునిగిందేవ్!' అని గొల్లుమంటూ పెద్దకూతుర్ని పిలిచింది.

'ఏవిటే అచ్చితం?' అనడిగింది అనంతలక్ష్మి.

'నాకేం తెలీదక్కా!' అని గొల్లుమంది అచ్యుతలక్ష్మి.

ఆడవాళ్లు రెండు రోజులు మథనపడి ఇక ఏం చెయ్యాలో తోచక సత్తిరెడ్డికి రహస్యంగా విషయం తెలియజేశారు.

సత్తిరెడ్డికి ఏం పాలుపోలేదు. అచ్యుతలక్ష్మి వరసకి మరదలైనా, వయసులో అంత అంతరం వుండటంవలన పిల్లలు లేని సత్తిరెడ్డి దంపతుల స్వంతబిడ్డలా గారాబంగా పెరిగింది.

శోకాలు పెడుతున్న అత్తగార్ని, పెళ్లాన్ని బయటకు పొమ్మని చెప్పి, గది తలుపులు వేసి అచ్యుతలక్ష్మితో అన్నాడు సత్తిరెడ్డి - "నా దగ్గర ఏం దాచకే అచ్చితం. ఏం జరిగిందో చెప్పు. ఏం చెయ్యాలో తర్వాత ఆలోచిద్దాం."

వెక్కుతూ వెక్కుతూ మరదలు చెప్పిందంతా విని, ఏ అఘాయిత్యం చేయనని ప్రమాణం చేయించి, గది తలుపులు తీశాడు సత్తిరెడ్డి.

'ఏమంది నాయనా?' అంది అత్తగారు ఆతృతగా.

"అదేమంటుంది - పెళ్లికాని పిల్లను పట్టుకుని తల్లివి కమ్మని భగవాన్ దీవిస్తే," అన్నాడు సత్తిరెడ్డి చికాగ్గా.

"దీవిస్తేనే కడుపవుతుందా?"

"మరెలా అవుతుంది అత్తా?"

అత్తగారు అల్లుడి ప్రశ్నకు సమాధానం చెప్పలేక మళ్లీ ఏడుపు మొదలుపెట్టింది.

".. దీవిస్తేనే సంతానం కలుగుతుందని కదా నువ్వు నన్ను భగవాన్‌ని దర్శించమంటున్నావు. ఇప్పుడు దీవిస్తే ఏమవుతుందంటున్నావు - భగవాన్ శక్తిమీద అపనమ్మకం నీకా, నాకా? ఎద్దెమంటె తెద్దెవంటుంది నువ్వా నేనా? అత్తా - ఇప్పుడు చెప్పు?" అన్నాడు సత్తిరెడ్డి నవ్వుతూ.

"కొంపలు మునిగి నేనేడుస్తుంటే నీకంతా పరిహాసంగానే వుంటుంది నాయనా. ఈసారి పొలం నుంచి వచ్చేప్పుడు ఓ ఎండ్రిను డబ్బా కూడా తీసుకురా! ఇంత జరిగాక లోకంలో తలెత్తుకు తిరగ్గలమా! లోకులు కాకుల్లా పొడిచెయ్యరూ? లోకం నమ్మొద్దూ?" అంది అత్తగారు.

"చచ్చినాడిని భగవాన్ బతికించాడంటే నమ్మే భక్తులు ఇదెందుకు నమ్మరు? శుభ్రంగా నమ్ముతారు," అన్నాడు సత్తిరెడ్డి.

"మీ మావకి ఎలా చెబుతావో ఏవిటో - నీదే బాధ్యత," అంటూ ఆ బాధ్యత అల్లుడికి అప్పగించేసింది అత్త.

మర్నాడు మధ్యాహ్నం భోజనాలయ్యాక రోజులాగే వసారాలో మామా అల్లుళ్లు చదరంగం ఆడడం మొదలుపెట్టారు. వెంకటరెడ్డి సత్తిరెడ్డి బలగాన్ని ఒక్కోదాన్నే తినేస్తూ మంచి హుషారుగా వున్నాడు. సంభాషణ ఎలా ప్రారంభించాలా అని ఆలోచిస్తూ సత్తిరెడ్డి పరధ్యానంగా ఆడుతున్నాడు.

వెంకటరెడ్డి సత్తిరెడ్డి మంత్రిని చంపేసి, 'నీ ఆట గోవింద అయ్యిందిరా సత్తీ' అన్నాడు.

'ఇంకా అవలేదు కదా.'

'ఇంకెంత - రెండెత్తులు తర్వాత ఆటకట్టు.'

'గెల్చిచూడు.'

'ఓర్నీ - గెలవననేంట్రా నీ అనుమానం? గెలిస్తే ఏమిస్తావు?'

రోజూ ఆడినప్పుడల్లా వెంకటరెడ్డే ఓడిపోతాడు. అలాంటిది ఈ రోజు తను గెలుస్తున్నందుకు హుషారుగా వుంది అతనికి. ఆ రెండెత్తులు వేసి ఆటకట్టుచేసి గర్జించాడు వెంకటరెడ్డి - "ఇప్పుడు పట్రా సత్తిగా ప్రైజు." 'ఇప్పుడు కాదు - ఆరు నెలల తర్వాత' అన్నాడు సత్తిరెడ్డి తాపీగా.

లోపలిగదిలోంచి మామాఅల్లుళ్ళ సంభాషణ వింటున్న ఆడవాళ్ళు కొయ్యబారిపోయారు.

'అదేంట్రోయ్?' అన్నాడు బండెంకటరెడ్డి ఆశ్చర్యంగా.

'నువ్వు తాతవి కాబోతున్నావు.'

'ఓర్నీ .... చూశావా' సత్తిరెడ్డి భుజంమీద గట్టిగా ఓ చరుపు

చరిచి సంతోషంగా ఉక్కిరి బిక్కిరవుతూ అన్నాడు బండెంకటరెడ్డి. "...సాములోరి దర్శనానికి రమ్మంటే రానని మొరాయించేవు. వెదవ నాస్తికం కబుర్లు చెప్పావు. ఇప్పుడైనా ఒప్పుకోరా సత్తిగా - ఆయనకు అద్భుత శక్తులున్నాయని! ఒప్పుకుని లెంపలేసుకో!'

'ఒప్పుకుంటున్నాను' సత్తిరెడ్డి లెంపలేసుకుంటూ అన్నాడు, "...కాని ఓ చిన్న సవరణ. తల్లికాబోతున్నది అనంతం కాదు - అచ్చితం..."

'అదేంటి ... దానికి పెళ్ళికాలేదుకాదా...'

బండెంకటరెడ్డికి ఈ వార్త అర్థంచేసుకోవడానికి రెండునిముషాలు పట్టింది. ఆ రెండు నిమిషాలూ లోపలగదిలో ఆడవాళ్ళు ఊపిరిపీల్చడం మానేశారు.

అలా రెండు నిమిషాలు రాయిలా వుండిపోయిన బండెంకటరెడ్డిలో మెల్లిగా చైతన్యం వచ్చింది. ఆ రెండు నిమిషాలు అతని మెదడుమాత్రం యమస్పీడులో ఆలోచించసాగింది.

అతని సింగిల్ ట్రాంక్‌మైండులో భగవాన్ సత్తిరెడ్డి మీద ఆగ్రహంతో తన మహిమ చూపించడానికి పెళ్ళికాని తన కూతుర్ని తల్లిచెయ్య సంకల్పించాడనే అనుమాన బీజం పడీపడడంతోనే మహావృక్షమైపోయింది. భగవాన్ అంటే వున్న భక్తి స్థానంలో మూర్ఖావేశం చోటుచేసుకుంది.

"సాములోరిది ఇంత కుచ్చితం బుద్దనుకోలేదురా సత్తిగా," బండెంకటరెడ్డి ఆంబోతులా బుసలుకొడుతూ లేచి నిలబడి రంకెలెయ్యసాగాడు, "నీకు బుద్ధి చెప్పడానికి దాని బతుకు నాశనం చేస్తాడా! ఆడి భక్తుణ్ణనేనా చూడకుండా మన కుటుంబం పరువు బజారుపాలు చేస్తాడా! నా పరువు గంగలో కల్సాక, నా కూతురు నవ్వుల పాలయ్యాక నేనెవరికీ బయపణ్ణురా! ఒరే సత్తిగా ... నా దుడ్డుకర్రందుకో!"

భర్త ఆలోచనా ధోరణి అప్పటికి అర్థమైన బండెంకటరెడ్డి భార్య 'ఓరి నా పిచ్చిమొగుడా - నువ్వెక్కడ దొరికావురా' అంటూ తలపట్టుకు కూలబడిపోయింది.

మామ ఆలోచన్ల ట్రెయిను ఎటు పరిగెడుతోందో అర్థమైపోయి హుషారుగా కొలిమిలోకి ఇంకొంచెం బొగ్గువెయ్యసాగాడు సత్తిరెడ్డి - "అవును మామా... నామీద కోపవైతే నన్ను శపించాలి. నా మేనమావవి కాబట్టి నిన్నుకూడా శపించినా తప్పులేదనుకో, కాని అభం శుభం తెలియని అచ్చితాన్ని నవ్వులపాలు చేస్తాడా?" అన్నాడు సత్తిరెడ్డి.

"నువ్వేం వర్రీ అవకురా సత్తిగా! అంతా రైటు చేసుకొస్తాను."

అని అల్లుడికి ధైర్యం చెప్పి, అచ్యుతలక్ష్మి కేసి తిరిగి, 'తల్లీ, అచ్చితం - నీకేం ఫరవాలేదే నేనున్నాగా - అంతా సెటిలు చేసుకొస్తాను. లేపోతే..." అంటూ సత్తిరెడ్డి ముద్దుపెట్టి అందించిన దుడ్డుకఱ్ఱ తీస్కుని సత్రం వైపు పరిగెట్టాడు బండెంకటరెడ్డి.

◆◆◆

బండెంకటరెడ్డి సత్రం చేరేటప్పటికి భగవాన్ మధ్యాహ్నం భోజనం చేసి, మధ్యహాలులో తూగుటుయ్యాలలో పట్టుపరుపుమీద పవ్వళించి, విశ్రాంతి తీసుకుంటున్నాడు. హాలుకి అవతలగదిలో ఓ పదిహేనుమంది ఆడవాళ్లు కూర్చునివున్నారు. హాలులోనూ, ముందుగదిలోనూ ఓ పన్నెండుమంది మగవాళ్లున్నారు.

శివకామయ్యగారు భగవాన్ పక్కనే నిలబడి ధర్మచర్చలు చేస్తున్నారు. మధ్యమధ్యలో భగవాన్ వివరణలిస్తుంటే ప్రతిమాటా అమృతతుల్యమైనట్టు భక్తులు పారవశ్యంతో వింటున్నారు.

బండెంకటరెడ్డి హాలులో ప్రవేశించగానే అందరిచూపూ అతనిమీద పడింది. భారీకాయాన్ని ఎండలో ఈడ్చుకువచ్చాడేమో అతను చెమటలుకక్కుతూ వగురుస్తున్నాడు. మొహం ఎఱ్ఱగా కందిపోయింది.

'ఏమోయ్ రెడ్డీ - ఏవిటీ హడావుడీ? ఎండ వేళ పడివచ్చావు?' అన్నారు భగవాన్ అర్థనిమీలితనేత్రాలతో చూస్తూ, చిరునవ్వు నవ్వుతూ.

బండెంకటరెడ్డి రెండడుగులు ముందుకు వేసి, 'స్వామీ...' అని మాత్రం అనగలిగాడు.

భగవాన్ చిరునవ్వు నవ్వుతూ శివకామయ్యగారికేసి తిరిగి, 'వెంకటరెడ్డి మనసులో ఏదో చింత వుంది' అన్నారు. వెంకటరెడ్డి మనసు భగవాన్ అలా చదివేసినందుకు హాలులో భక్తులు ఆశ్చర్యపోయారు.

"సామీ.. తవరికి తెలియనిదేవుంది? తవరికంతా తెల్సు," అన్నాడు బండెంకటరెడ్డి గద్గద కంఠంతో.

భగవాన్ అవునన్లేదు. కాదనలేదు - నిండుగా చిరునవ్వు మాత్రం నవ్వారు. బండెంకటరెడ్డి మనస్సు చివుక్కుమంది.

"... సత్తిరెడ్డి మీద తమరికి ఆగ్రహం కలిగితే ఆణ్ణి శపించండి. ఆడి మేనమావ ఎదవని కాబట్టి మీ పాదదాసుణ్ణి అనికూడ కనికరించకుండా నన్ను శపించండి కాని..."

'వెంకటరెడ్డికి మనవడి గురించి చింత' అని, జ్ఞాననేత్రంతో భవిష్యత్తు చూస్తున్నట్లు కళ్లు కొంచెం సేపు మూసి తెరిచి, వెంకటరెడ్డికేసి చూస్తూ 'నీ కోరిక త్వరలోనే నెరవేరుతుందని చెప్పాను కదా!' అన్నారు భగవాన్.

'నా బెంగా అదేకదా సామీ' అనుకున్నాడు బండెంకటరెడ్డి దుఃఖంతో కాని విషయం ఎలా మొదలుపెట్టాలో అతనికి తెలియలేదు. చివరకి గుటకలు మింగుతూ మొదలుపెట్టాడు. "... సామీ.. తమరు ఆ రోజున మా అచ్చితాన్ని దీవించారు.. తవరికి అంతా గుర్తే. అచ్చితం ఇప్పుడు... మూడో నెల..."

చూశారా భగవాన్ మహిమ అన్నట్లు హాల్లోని భక్తులు కళ్లు పెద్దవిచేసి, ఓసారి నోళ్లు తెరిచి మూసి, ఓసారి చేతులు గుండెలమీద వేసుకుని తీసి, ఒకళ్ల మొహాలు ఒకళ్లు ఆశ్చర్యంగా చూసుకుని, తలలూపుతూ సంభ్రమంగా చూశారు. తన మహిమల కిరీటంలో ఓ కొత్త తురాయి తగిలించుకున్న భగవాన్, 'ఇది నాకు మామూలే కదా' అన్నట్లు భక్తులకేసి ఓరకంట చూసి చిన్నగా నవ్వారు.

భగవాన్ త్రికాలజ్ఞులే కాని ఆ సమయంలో, షడ్రసోపేతమైన భోజనం చేసిన తర్వాత ఆయన మెదడు చురుగ్గా పనిచెయ్యడం లేదు కాబోలు - క్షణంలో ఆయన మీద ఆకాశం కూలబోతోందన్న సంగతి ఆయనకు తెలియలేదు. అంచేత, "ఎవరైతేనేం... నీకు కావాల్సింది మనవడేకదా రెడ్డీ!" అన్నారు.

"సామికి తెలియని విషయమా... మా చిన్నమ్మాయికి... అచ్చితానికి... ఇంకా పెళ్లికాలేదు..." అన్నాడు బండెంకటరెడ్డి కన్నీళ్లపర్యంతమవుతూ.

ఈసారి భగవాన్ గొంతులో పచ్చి వెలక్కాయ పడలేదు. నెత్తిమీద వెయ్యి మెగాటన్నుల ఆటంబాంబు పేలింది. స్టిల్ ఫోటోలా ఆ నవ్వు అలానే వుంది. కాని దానిలో జీవం మాత్రం అదృశ్యమైంది.

'ఓవర్ టు యు' అన్నట్లు భగవాన్ శివకామయ్యగారి కేసి నిస్సహాయంగా చూశారు. శివకామయ్యగారికీ ఏం పాలుపోలేదు. కాని మనస్సులోని ఆందోళన బయటకు కనబడనీయకుండా చిరునవ్వు అడ్డు పెట్టుకుని, 'ఏవిటి రెడ్డీ నువ్వంటున్నది - వివరంగా చెప్పు' అన్నారు.

ఆ చిరునవ్వు అర్థం మిన్ను విరిగి మీదపడ్డా భగవాన్ చలించరు అని తెలియజెయ్యటమే కాని పరిహాసం మాత్రం కాదు. కాని వాళ్లిద్దరూ తన దుస్థితి చూసి నవ్వుకుంటున్నట్లు అనిపించింది బండెంకటరెడ్డికి.

అంతకుముందు అచ్చితాన్ని దీవించినప్పుడు కూడా వాళ్లిద్దరూ అలా చిరునవ్వులు చిందించడం గుర్తుకొచ్చింది. ఇది తననూ, తన కుటుంబాన్నీ అవమానించడానికి భగవాన్, శివకామయ్యలు పన్నిన పన్నాగం అనిపించి ఆగ్రహం కలిగింది. కాని తన్నుతాను నిగ్రహించుకుని భగవాన్ పంక తిరిగి చేతులు జోడించి నమస్కరించాదు బండెంకటరెడ్డి.

"సామీ... తవరికి అంతా తెల్సు... తెల్సి నానోటిచేతే చెప్పించాలని తమ ఉద్దేశం. సరే అలాగే కానివ్వండి. తవరు సత్తిరెడ్డిమీద ఆగ్రహించారు. దానికి నాకు బాధలేదు. ఆడొట్టి నాస్తిక ఎదవ. ఆడికి తమ పవరు చూపించాలనుకున్నారు. పెళ్లికాని అచ్చితాన్ని తల్లవుతావని దీవించారు. దానికిప్పుడు మూడోనెల - తవరికి తెలీదా ఇదంతా? మా కళ్లు తెరిపించడానికి అలా చేశారు. ఇప్పుడు సత్తిగాడికి కూడా మీ మహిమ తెల్సిపోయి ఆడి కళ్లు తెరుచుకున్నాయి. ఆదు నా ఎదురుగా లెంపలేసుకున్నాడు. కావాలంటే ఆణ్ణి మీ కాళ్ల దగ్గరకు తీసుకొచ్చి పడేస్తా! మీ ఎదురుగా లెంపలేసుకుంటాడు ఆదు, ఇక శాంతించి మీ లీల చాలించండి సామీ!" అని రెండుచేతులూ జోడించి దీనంగా ప్రార్థించాదు బండెంకటరెడ్డి.

'భగవాన్‌ని ఏం చెయ్యమంటావు?' - శివకామయ్యగారు అడిగారు అయోమయంగా.

"ఇప్పుడు అచ్చితం కడుపులో వున్న బిడ్డని ఆయన అనంతం కడుపులోకి ట్రాన్స్‌ఫర్ చెయ్యాలి?" - తన డిమాండేవిటో కుండబద్దలు కొట్టినట్లు చెప్పేశాదు బండెంకటరెడ్డి.

'అదెలా సాధ్యం?' అన్నారు శివకామయ్యగారు తెలబోతూ.

'ఇది సాధ్యమైనప్పుడు అదెందుకు సాధ్యం కాదు?' - ఎదురు ప్రశ్న వేశాదు బండెంకటరెడ్డి. లోకజ్ఞానం లేని అమాయక భక్తులుండడం లాభమే కాని ఒక్కోసారి ప్రాణాంతకంగా కూడా పరిణమిస్తుందన్న సత్యం భగవాన్‌కీ, ఆయన అంతరంగిక భక్త బృందానికి అనుభవంలోకి వచ్చింది. "..భగవాన్ శక్తి నీకు తెలీదా శివకామయ్యా! ఆయన చచ్చిపోయినాళ్లను బ్రతికించారు. జపానోడితో జర్మన్లో మాట్లాడారు. తాళాలేసిన గదిలోంచి

మాయమైపోయారు. విశాఖపట్టణంలోనూ, విజయనగరంలోనూ ఒకేసారి రెండురూపాలలో దర్శనమిచ్చారు. ఇయన్నీ నువ్వే చెప్పావు - మర్చిపోయావా? ఆయనకు అసాధ్యమైంది ఏదీలేదు - ఆయన తల్చుకుంటే ఏమైనా చెయ్యగలరు - తల్చుకోవాలేతప్ప" అన్నాడు బండెంకటరెడ్డి, 'తల్చుకోవాలేతప్ప' అన్నమాట కొంచెం వత్తి పలుకుతూ.

భగవాన్ అలా ప్లాస్టిక్ పువ్వులా నవ్వుతున్నారు. కాని ఆయనకి అంతా కంగారుగా వుంది. అక్కడి నుంచి మాయమైపోయి ఎక్కడికేనా పారిపోవాలనిపించింది ఆయనకి. కాని కుండలినీ శక్తి అప్పుడు బలహీనంగా వుండి మూలాధారంలోంచి పైకి లేవలేదు కాబోలు భగవాన్ అదృశ్యమవలేక, కాళ్లూ, చేతులూ ఆడక, ఉయ్యాల మీదే ఉండిపోయాడు.

బండెంకటరెడ్డి మాటల్లో అంతర్లీనంగా వున్న హెచ్చరిక శివకామయ్యాగారికి అర్థం కాలేదు. కాని కొంచెం టైము సంపాదించడానికి, 'భగవాన్‌ని విశ్రాంతి తీసుకోనీ, తర్వాత చూద్దాం!' అన్నారు.

'ఇంక తర్వాత చూసేదేంటి - మూడో నెలొచ్చేసింది' - బండెంకటరెడ్డి చెయ్యి దుడ్డుకర్ర చుట్టూ బిగిసింది - "నేనింటికెళ్లేటప్పటికి ఇదంతా అయిపోవాలి. లేకపోతే భగవాన్ మమ్మల్ని అనుగ్రహించలేదని అనుకోవాల్సి వస్తుంది" అని అల్టిమేటం ఇచ్చేశాడు బండెంకటరెడ్డి.

'ఓరి మూర్ఖపు తొత్తుకొడకా' అనుకుంటూ శివకామయ్యాగారు బాధగా తలపట్టుకున్నారు రెండు చేతులతో. అలా రెండుచేతుల్లోనూ వున్న తలమాత్రం విరామం లేకుండా శాస్త్రాలన్నీ నెమరువేయసాగింది.

శాస్త్రాలలో గొప్పతనం ఏవిటంటే - అహింసామూర్తి గాంధీగార్ని, ఆయన్ని అంతంచేసిన గాడ్సే గార్ని, ఇద్దరినీ కార్యాచరణకు పురికొల్పినది భగవద్గీతే అయినట్లు - అవి ఏ సన్నివేశానికయినా సరిగ్గా అతికే ధర్మసూక్ష్మాలూ, సూక్తులతో నిండివుండి, పరస్పర విరుద్ధమైన విషయాల్ని సమర్థించగలవు.

శివకామయ్యాగారు ఆ అక్షయతూణీరం నుంచి అస్త్రాలు లాగి, 'పరమాత్మ-జీవాత్మ-కర్మ' అని గుక్కతిప్పుకోకుండా ఓ అయిదు నిమిషాలు మాట్లాడి, 'జరిగేదంతా పరమాత్మ సంకల్పమే అయినా జరగాల్సింది జీవాత్మ ద్వారానే కదా,' అన్నారు.

సూటిగా చెబితేనే బండెంకటరెడ్డికి అర్థంచేసుకోడానికి అరగంట పడుతుంది. అలా గుంభనగా శివకామయ్యాగారు వదిలిన అస్త్రాలవర్షం

దున్నపోతుమీద కురిసిన వానే అయింది.

'తపరంటున్నది నాకు బోధపడ్డంలేదు' అన్నాడు బండెంకటరెడ్డి.

ఇంక లాభంలేదని, 'అంచేత... అమ్మాయిని... మొదట... ఆ కుఱ్ఱవాడెవరో... అడిగి తెల్సుకో! ఆ తర్వాత వివాహం చేసేద్దాం!' అన్నారు శివకామయ్యగారు సూటిగా.

లోపలగదిలో ఆడవాళ్లు ఒకేసారి ఎవళ్ల బుగ్గలు వాళ్లు నొక్కుకుని, ఒకళ్ల చెవులు ఒకళ్లు కొరుక్కుని, మళ్లీ చెవులు చాటల్లా చేసి నిశ్శబ్దమైపోయారు. పదిహేను హై-పవర్డ్ ట్రాన్స్‌మిటర్లు ఈ విషయం దేశమంతా ప్రసారం చెయ్యడానికి సిద్ధం అయిపోయాయి.

తన కూతురి శీలాన్ని శంకిస్తున్నందుకు బండెంకటరెడ్డికి ఆగ్రహంతో నోటమాట రాలేదు. అతను భగవాన్‌కేసి తిరగగానే, అంతవరకు మౌనంగా చిరునవ్వుతో తిలకిస్తున్న భగవాన్, శివకామయ్యగారు బోధించిన ధర్మసూక్ష్మాలు మరింత వివరించే ఉద్దేశంతో, చిరునవ్వు మరో మూడంగుళాలు - ముప్పయి రెండు పళ్లూ కనిపించేలా - పెద్దది చేసి, ఊయల దగ్గరున్న కాలిపీట ఎడంకాలితో బండెంకటరెడ్డికేసి తన్ని 'ఇలా కూర్చో రెడ్డీ' అన్నారు.

ఎడంకాలితో అలా కాలిపీట తనకేసి తన్నడం, ఆ కాల్గేట్ నవ్వూ చూసేటప్పటికి బండెంకటరెడ్డికి ఆగ్రహం మరి ఆగలేదు. అతని చూపు ఒకక్షణం భగవాన్ ముఖమండలంలో ప్రకాశిస్తున్న పలువరసమీద నిలిచింది.

అంతే!

మరుక్షణం బండెంకటరెడ్డి దుడ్డుకఱ్ఱ గాలిలోకి లేచి, భగవాన్ మొహంమీద దిగుతుంటే, అసంకల్పిత ప్రతీకారచర్యగా ఆయన కుడిచెయ్యి అడ్డం పెట్టుకుని, చెయ్యి పుటుక్కుమనగా 'అమ్మోయ్' అనరిచారు. ఆయన అలా అరుస్తుండగానే రెండో దెబ్బ ఎడంకాలికి తగిలి తొడ ఎముక టుపుక్కుమంది.

భగవాన్ ఈసారి 'బాబోయ్' అనరిచి, స్టంటు సినిమాలోలా మెరుపులా ఉయ్యాలమీంచి దొర్లి ఉయ్యాలకిందకు దూరి పోయారు ప్రాణభీతితో.

'ఓవర్ టు యు' అని భగవాన్ ఈసారి అనకపోయినా దుడ్డుకఱ్ఱ శివకామయ్యగారికేసి తిరిగి ఆయన్నికూడా ఒకటందుకుంది. 'చచ్చాన్ భగవాన్' అంటూ ఆయన ఆరడుగులు పైకి లేచి హాలులోంచి, ముందుగదిలోంచి

ఎగురుతూ బయటికి వెళ్లిపోయారు.

శివకామయ్యగారికి వడ్డించి, భగవాన్‌కి మారు వడ్డన చేద్దామని భగవాన్‌కేసి తిరిగి, ఉయ్యాలమీద ఆయన కనిపించకపోతే, 'ఏడీడు?' అని ఆశ్చర్యపోయాడు బండెంకటరెడ్డి. అంతలో ఊయలకిందనుంచి ఆర్తనాదాలు వినిపిస్తుంటే, 'అమ్మదొంగా! ఇక్కడున్నావా!' అని బండెంకటరెడ్డి నేలమీద చతికిలబడి, గాది కింద దూరిన పంది కొక్కుని అదిలించినట్లు ఊయల కింద దూరిన భగవాన్‌ని 'ఉష్ ... ఉష్...' అని కర్రతో అదిలిస్తుండగా లోపల గదిలోని ఆడవాళ్లు ఆయన్ను లోపలికి లాగి తలుపేసేశారు.

'మీ మావ వెళ్లి చాలాసేపైంది. ఏవయ్యిందో ఏవిటో - ఒకసారి చూసిరా నాయనా' అని అత్తగారు అల్లుణ్ణి బతిమాలుతుంటే, 'సత్తిరెడ్డీ! మీ మావ సాములోర్ని చావగొట్టేస్తున్నాడు' అని ఎవరో వీధిలోంచి పెద్దగా కేకవేశారు.

'ఆహా... ఇన్నాళ్లకు మా మావ నా మనసుకు నచ్చిన పని చేస్తున్నాడు కదా' అన్నాడు సత్తిరెడ్డి ఆనందంగా.

"నీకు ఆనందంగానే వుంటుంది. అక్కడ సాములోరు చచ్చిపోతే మీ మావని జెయిల్లో పెట్టి ఉరితీస్తే అప్పుడు ఇంకా సంతోషిద్దువుగాని" అంది అత్తగారు మళ్లీ రాగాలు తీస్తూ. సత్తిరెడ్డి వెళ్లేటప్పటికి సత్రంలో అంతా గందరగోళంగా వుంది. బయట పందిరి కూలిపోయింది. దానికి కట్టిన తోరణాలు, చెల్లాచెదరైపోయాయి. భగవాన్ సింహాసనం ముక్కలు ముక్కలుగా విరిగిపోయివుంది. ఆ ముక్కలన్నీ ఆవరణంతా చెల్లాచెదురుగా పడివున్నాయి. దీనవదనాలతో భక్తులు ఉయ్యాలమీద పడుకున్న భగావాన్‌కి అమృతాంజనం మర్దన చేస్తున్నారు. ఆయన బాధకి తట్టుకోలేక 'అమ్మో' అంటున్నారు. ఎవరో ఆయన పరిస్థితి చూసి, 'ఇక లాభంలేదు - పట్నం తీసుకెళ్లాల్సిందే' అంటున్నారు.

మరోమూల కొందరు భక్తులకి - భగవంతుడిని భక్తుడు చావగొడితే భగవంతుడు సామాన్యుడిలా ఎర్రటోపీని, నల్లకోటుని ఆశ్రయించాలా లేదా - అనే ధర్మసందేహం వచ్చి తీవ్రంగా శాస్త్రిచర్చలు చేస్తున్నారు.

'మనవల్ల తేలేది కాదు - విజయవాడ రేడియో వ్యాసుడికి ట్రంక్‌కాల్ బుక్‌చెయ్యండి. ఆయనే ఈ ధర్మసందేహం తీర్చగలరు' అని ఎవరో సలహాయిచ్చారు.

'ఎవరూ ఏం చెయ్యక్కర్లేదు - బండెంకటరెడ్డి వారం రోజులలో

రక్తం కక్కుకుని చచ్చిపోతాడు' అన్నారు భగవాన్ ఆగ్రహంతో.

మామ సత్రంలో కనుపించక ఊరంతా గాలిస్తున్న సత్తిరెడ్డికి, సాయంకాలానికి చెరువు గట్టున, గుడి అరుగుమీద బాసింపట్లు వేసుకు దిగులుగా కూర్చున్న వెంకటరెడ్డి కనిపించాడు. భగవాన్‌కి శాస్తి చేసేశాడుకాని అసలు సమస్య బండెంకటరెడ్డిని వేధిస్తూనే వుంది. అతని మనసంతా దిగులుతో నిండిపోయింది. రాత్రయేదాకా వుండి చెర్లోపడి చచ్చిపోవాలని నిర్ణయించుకుని, ఆ ముహూర్తం కోసం ఎదురుచూస్తూ గుడి అరుగుమీద కూర్చుని వున్నాడు.

సత్తిరెడ్డిని చూస్తూనే, 'ఒరే సత్తీ.. మీ అత్తనీ, అచ్చితాన్నీ జాగ్రత్తగా చూసుకోరోయ్,' అన్నాడు బండెంకటరెడ్డి అప్పగింతలు అప్పగిస్తూ.

'నువ్వెక్కడికెడుతున్నావు?' - బండెంకట రెడ్డి ఏవాలోచిస్తున్నాడో అర్థమై సత్తిరెడ్డి నవ్వుతూ అన్నాడు, "మావా... ! ఊరివాళ్లకు ఇదొక్కటే మంచినీళ్ల చెరువు. అయినా నీ చావును గురించి నువ్వేం బెంగపెట్టుకోకు. భగవాన్ నువ్వు వారం రోజుల్లో చచ్చిపోతావని శపించారు తెల్సా?" 'ఏడిశాడు' అన్నాడు బండెంకటరెడ్డి భగవాన్‌ని ఈసడిస్తూ.

'ఏవిటన్నావు?' - మావలో హఠాత్తుగా అంతమార్పు వచ్చి, అంత ధైర్యంగా మాట్లాడుతున్నందుకు ఆశ్చర్యపోతూ అడిగాడు సత్తిరెడ్డి.

'ఏడిశాడంటున్నా!'

"అంటే... భగవాన్‌కి ఏ పవరూ లేదని ఇప్పుడేనా ఒప్పుకున్నావన్న మాట," అన్నాడు సత్తిరెడ్డి మూసిన కళ్లు తెరుచుకున్నందుకు ఆనందిస్తూ.

'అదిమాత్రం నేనొప్పుకోనురోయ్! ఆడికి పవరుంది కాని...' బండెంకట రెడ్డి లాల్చీ జేబులోంచి కాగితం పొట్లం ఒకటి తీసి, జాగ్రత్తగా మడతలు విప్పి, అందులో మంచి ముత్యాల్లా మెరుస్తున్న భగవాన్ ముందుపళ్లు మూడు చూపిస్తూ... "మనం ఆడి పళ్లూడగొట్టేశాంగదా! ఇప్పుడు ఆడు మననేం చెయ్యలేడురా సత్తీ! ఆడి పవరుపోయింది. నువ్వేం వర్రీ అవకు!" అన్నాడు అల్లుడికి ధైర్యం చెబుతూ.

ఒక్కొక్కసారి మూర్ఖత్వానికి మహామూర్ఖత్వం విరుగుడుగా పనిచేస్తుంది కాబోలు ... అనుకుని సత్తిరెడ్డి నవ్వుకుంటుండగా, భగవాన్‌ని పట్నం తీసుకువెడుతున్న ట్రాక్టరు అటువేపు వచ్చింది. ట్రాక్టరు ట్రాలీలో రెండు పరుపులు పరిచి భగవాన్‌నీ, శివకామయ్యగారిని పడుకోబెట్టారు.

లోకం అంతా మాయేకావచ్చు కాని భగవాన్‌కి తగిలిన దెబ్బ

బండెంకటరెడ్డి దుద్దుకర్ర సైజంత వాస్తవం కదా! ఆ బాధకి తట్టుకోలేక భగవాన్ 'ఉ ... ఉ ...' అని మైలుదూరం వినిపించేలా పెద్దగా మూలుగుతున్నారు. ఆయన మూలుగుకీ మూలుగుకీ మధ్య 'ఓవర్ టు యు' అన్నట్లుగా ఇస్తున్న విరామంలో భగవాన్ మూలుగుకి ప్రతిధ్వనిలా శివకామయ్యగారి మూలుగు, దీర్ఘంగా, 'ఊ.. ఊ..' అని వినిపిస్తోంది.

'మాయ మాయని మాయతో చాపగొడితే మాయ మాయ మీదెక్కి మాయ దగ్గరికి మాయవైద్యం కోసం వెడుతోంది' అన్నాడు సత్తిరెడ్డి ఆ 'ఉ ... ఊ' లు వింటూ.

'ఏంటది - పొడుపు కథా!' అడిగాడు బండెంకటరెడ్డి.

'ఏమీలేదులే - నువ్వు విప్పడానికి ట్రై చెయ్యకు. ఇప్పటికే నీ బుర్ర చాలా అల్సిపోయింది' అని 'కృష్ణా... ఇలారా' అని పిలిచాడు సత్తిరెడ్డి.

అంతవరకు మసకవెలుగులో గుడిస్తంభాల మధ్య తారట్లాడుతున్న ఆ పాతికేళ్ల కుర్రాడిని బండెంకటరెడ్డి గమనించలేదు. సత్తిరెడ్డి పిలవగానే ఆ కుర్రాడు పరిగెట్టుకొచ్చి అతనిపక్కన చేతులు కట్టుకుని నిలబడ్డాడు.

'ఎవరీ అబ్బాయి?' బండెంకటరెడ్డి అడిగాడు.

'నా తమ్ముడు' అన్నాడు సత్తిరెడ్డి.

'నాకు తెలీకుండా నీకు తమ్ముడెప్పుడు పుట్టుకొచ్చాడురా సత్తీ?'

'అచ్చితం మొగుడు నాకు తమ్ముడే కదా!'

'అచ్చితం మొగుడేంటి?'

'నీ మనవడి తండ్రి...'

'నా మనవడి తండ్రేవిటి? మనవడి..తం...డ్రి'

సత్తిరెడ్డి చెబుతున్నదేవిటో అప్పటికి అర్థమైంది బండెంకటరెడ్డికి.

'ఒరే సత్తిగా... నా దుద్దుకర్రేదిరా...' అని వెంకటరెడ్డి అరుస్తుంటే, సత్తిరెడ్డి తోడల్లుడిని మావగారి కాళ్లమీదకు తోస్తూ, "...నారాయణరెడ్డిగారి మూడో అబ్బాయి, వాళ్లిద్దరూ ఇష్టపడ్డారు.. ఏదో తొందరపడ్డారనుకో... వీళ్లను క్షమిచి దీవించు మావా!" అన్నాడు.

ఏది ఏమైనా భగవాన్ దీవెన వృథాపోలేదు - పెద్దల ఆశీర్వాదంతో కృష్ణారెడ్డి, అచ్యుతలక్ష్మిల వివాహం వైభవంగా జరిగిన అయిదునెలలకి పండంటి మనవణ్ణి ఎత్తుకున్నాడు బండెంకటరెడ్డి. మనవడు అంతా

తాతగారి పోలికే! చిన్నప్పుడే బాలభీముడిలా వుండేవాడు.

మనవడిని ఓ క్షణం దింపకుండా తాతగారు ఎత్తుకుతిరుగుతుండేవారు. తాతనెత్తిమీద మనవడు బంఁడ్రాయి మీద గుంఁడ్రాయిలా కూర్చుని ఊరేగుతుండేవాడు.

"మావా" ఓ రోజు తాతగారు పడకకుర్చీలో పడుకుని, మనవడిని పొట్టమీద పడుకోబెట్టుకుని ఆడిస్తుంటే అన్నాడు సత్తిరెడ్డి, "... ఈ సృష్టి ఎప్పుడు పుట్టిందో, ఎలా పుట్టిందో ఎవరికీ తెలియదు. అనాదిగా అనేకమంది ఇది అర్థంచేసుకోడానికి ప్రయత్నిస్తూనే వున్నారు. వాళ్లకు తోచింది చెబుతున్నారు. వాళ్లకి మనం నమస్కరించాలి. వాళ్లు చెప్పింది - గుడ్డిగా నమ్మకూడదు - విని ఆలోచించాలి. కాని భగవాన్‌లాంటి మాయగాళ్లు ఈ సృష్టి రహస్యం అంతా తెల్సిపోయినట్లు పరమాత్మ - జీవాత్మ - కర్మ అంటూ సంస్కృత శ్లోకాలు గుప్పిస్తూ, వాళ్లకే అర్థంకాని విషయాల గురించి పప్పు రుబ్బడవే కాకుండా, శూన్యంలో సృష్టిస్తున్నామంటూ విభూతి, ఉంగరాలు, గొలుసులూ, వాచీలూ..."

రెండు పిల్లులు దెబ్బలాడుకుంటున్న శబ్దాలు వినిపిస్తే సత్తిరెడ్డి ఉలిక్కిపడి ఆగిపోయి చూసి, రెండుచేతులతోనూ తల పట్టుకున్నాడు - తాతగారు పడకకుర్చీలో పడుకుని పెద్దగా గుఁర్రుపెడుతున్నాడు. మనవడు తాతగారి బొజ్జమీద పడుకుని చిన్నగా గుఁర్రుపెడుతున్నాడు.

'వీడికి తాతగారి పోలికొస్తే వచ్చిందిగాని ఆ తాత బుఁర్ర రాకుండా వుంటే బావుండును' అనుకున్నాడు సత్తిరెడ్డి నిట్టూరుస్తూ.

సత్తిరెడ్డి చెప్పింది బండెంకటరెడ్డి ఎంతవిన్నాడో, విన్నది ఎంత అర్థంచేసుకున్నాడో తెలియదుగాని గుళ్లో ఏ పురాణకాలక్షేపం జరిగినా, ఊరికి ఏ స్వామీజీ వచ్చి ధర్మోపన్యాసాలు ఇస్తున్నా భక్తిగా, తప్పనిసరిగా హాజరయ్యేవాడు.

అయితే విభూతీ, ఉంగరాలూ, శివలింగాలూ సృష్టించే బాబా ఎవరేనా ఆ ఊరు వస్తుంటే మాత్రం అందరికంటె ముందు స్వాగతం పలకడానికి బండెంకటరెడ్డి పరుగెట్టేవాడు - దుడ్డుకఁర్ర తీసుకుని.

*['విపుల' జూన్ 1990 సౌజన్యంతో]*

* * * *